నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 | హైదరాబాద్, మంగళవారం 19 మార్చి 2024 | SANGAREDDY

ఆరెపల్లిలో బీరప్పగుడిలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

పెద్దశంకరంపేట, మార్చి 18: జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా గెలిపిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట మండలం ఆరెపల్లిలో నిర్వహించిన బీరప్ప జాతరకు ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దశంకరంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన కేసీఆర్‌కు రుణపడి ఉంటానన్నారు. ఎంపీలుగా చేసిన బీబీ పాటిల్, సురేశ్‌కుమార్ షెట్కార్ ఈ ప్రాంత అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయలేదని విమర్శించారు. నారాయణఖేడ్ ప్రాంత అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. తనకు అవకాశం ఇస్తే నారాయఖేడ్ ప్రాంతంలో యువతకు ఉపాధి కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తనను ఆశీర్వదించి, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ హయాంలోనే నారాయణఖేడ్ అభివృద్ధి

– మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ హయాంలోనే నారాయణఖేడ్ ప్రాంతం అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్ ఎంపీగా ఉన్నప్పుడు దేవాలయ భూములను వదలకుండా స్వాహా చేశారని ఆరోపించారు. తప్పుడు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, రూ.15 వేలకు రైతుబంధు పెంచుతామని చెప్పిన నాలుగు ఎకరాల రైతులకు కూడా డబ్బులు వేయలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పూటకో మాట చెబుతూ కాలం వెళ్ల దీస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారుడు, రైతుబిడ్డ గాలి అనిల్ కుమార్ మన ప్రాంతబిడ్డ, ఈ ప్రాంత కష్టసుఖాలు, సమస్యలు ఆయనకు తెలుసున్నారు. బీబీ పాటిల్ పదేండ్లలో పదవిని అడ్డం పెట్టుకొని కంగ్టి మండలంలో పేద రైతుల భూములను గుంజుకున్నాడని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీలు దత్తు, సురేశ్‌గౌడ్, రాజేశ్వర్, నాయకులు కుంట్ల రాములు, విఠల్‌గౌడ్, రవీందర్, నరేశ్, వెంకట్‌రెడ్డి, గంగారాం, శంకర్‌గౌడ్, కో–ఆప్షన్ యాదూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను విడుదల చేయాలి

సిద్దిపేట పాత్త బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సిద్దిపేట టౌన్, మార్చి 18 : ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్ట్‌ను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని, వెంటనే ఆమెను విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కవిత అరెస్టును నిరసిస్తూ సిద్దిపేట పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద సోమవారం రాస్తారోకో చేశారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రజల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే కుట్రలో భాగమే ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్ట్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో అనేక సార్లు జైలుకు వెళ్లిన ఈ గడ్డకు జైలు గోడలు కొత్త కాదన్నారు. ఎమ్మెల్సీ,ఉద్యమ నాయకురాలు కవితను విడుదల చేయాలని, లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామన్నారు. నిరసనలో జిల్లా అధ్యక్షుడు రాజేందర్, వెంకటేశ్, రాజు, కృష్ణ, తిరుపతి, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

ఎంపీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

మెదక్ ఎంపీ స్థానం పరిధిలో 18.12 లక్షల మంది ఓటర్లు

ఏప్రిల్ 15 వరకు ఓటుహక్కు నమోదుపై విస్తృత ప్రచారం చేయాలి

సీవిజిల్ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు

1950 టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు

మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎన్నికలపై మీడియా సమావేశం

మెదక్, మార్చి 18(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ బాలస్వామితో కలిసి ఎన్నికల నిర్వహణపై ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిందని, మెదక్ పార్లమెంట్ స్థానం పరిధిలో సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయని తెలిపారు. ఈ సెగ్మెంట్ల పరిధిలో తుది ఓటరు జాబితా ప్రకారం 18,12,858 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో మెదక్ నియోజకవర్గంలో 2,16,748 మంది ఓటర్లు, నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2,26,154 మంది, సిద్దిపేట నియోజకవర్గంలో 2,36,474 మంది, సంగారెడ్డి నియోజకవర్గంలో 2,47,338 మంది, పటాన్‌చెరు నియోజకవర్గంలో 4,07,419 మంది, దుబ్బాక నియోజకవర్గంలో 1,99,236 మంది, గజ్వేల్ నియోజకవర్గంలో 2,79,489 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. 2098 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని, 240 మంది సెక్టార్ ఆఫీసర్లు, రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఓటర్లు జాబితాలో తమ పేరు సరిచూసుకోవాలని, పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని సూచించారు. అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఓటర్‌కు రెండు కిలోమీటర్ల రేడియస్‌లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని పేరొన్నారు. మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తయిందని, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తిచేస్తామన్నారు. కోడ్ అమలులోకి వచ్చిందని, మతం, కులం, ప్రాంతంపై విద్వేశాలు పెంచేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు ఇస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని చెప్పారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థనా స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వేలెన్స్ బృందాలు, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు.

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్.. 1950

ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1950, సి–విజల్ యాప్ ద్వారా చేయవచ్చని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని, సి–విజల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల్లో అధికారులు క్షేత్రస్థాయికి చేరుకుని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24గంటల వ్యవధిలో, బస్టాండ్, రైల్వేస్టేషన్, పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ ప్లేస్‌ల్లో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాల్లో 72 గంటల వ్యవధిలో పూర్తిస్థాయిలో తొలిగిస్తామని కలెక్టర్ తెలిపారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్‌నెంబర్, ఎవరు ప్రింట్ చేయమన్నారో వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని, ఈ అంశాన్ని అన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించి, వివరిస్తామని కలెక్టర్ తెలిపారు.

కట్టుదిట్టమైన చర్యలు...

– మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి

మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు నిఘా ఉంచామని తెలిపారు. రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, ప్రతిరోజు తనిఖీల్లో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవర్తనా నియమావళిని పాటించాలి

72 గంటల ముందు అనుమతులు పొందాలి

మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని మెదక్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో మెదక్ ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా, ఎన్నికల నియమావళిపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఉల్లంఘనలకు పాల్పడరాదని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలు తెలియజేయాలన్నారు. కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ఎన్నికలకు సంబంధించిన ఉల్లంఘనలు, సందేహాలు ఉంటే సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలు ఉండరాదన్నారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు ఓటరు జాబితాలు అందిస్తామన్నారు. ఏఆర్వో, ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి రూ.95 లక్షల వరకు ఖర్చు పరిమితి ఉందని, ఖర్చుచేసే ప్రతి పైసా ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ తీసి అందులో నుంచే ఖర్చు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోని సహాయ ఎన్నికల పరిశీలకులు షాడో రిజిస్టర్‌లో నమోదు చేస్తున్న లెక్కలతో సరి చూసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం కలెక్టరేట్‌లోని సువిధ సెల్‌కు లిఖిత పూర్వకంగా కనీసం 72 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలని, అన్ని అనుమతులు సువిధ ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించినట్లు సమాచారం ఉంటే ఫొటోలు, వీడియోలను ఈసీఐ కల్పించిన సీ–విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల ప్రసార ప్రకటనలు జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ నుంచి గూడూరి ఆంజనేయులు, బీఆర్ఎస్ నుంచి చింతల నర్సింహులు, బీజేపీ నుంచి ఎంఎల్ఎన్ రెడ్డి, బీఎస్పీ నుంచి సిద్ధిరాములు, ఎంఐఎం నుంచి సయ్యద్ సాకేత్ అలీ, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

లైసెన్స్ తుపాకులు

డిపాజిట్ చేయాలి

సిద్దిపేట సీపీ బి.అనురాధ

సిద్దిపేట అర్బన్, మార్చి 18: పార్లమెంట్ సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున లైసెన్స్ ఉన్న తుపాకులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీలోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని.. ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత తిరిగి నిబంధనల ప్రకారం తీసుకోవచ్చన్నారు. తుపాకులు డిపాజిట్ చేయని వారిపై ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ గురించి చర్యలు తీసుకుంటున్నామని.. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను ప్రజలు, ప్రజాప్రతినిధులు తప్పకుండా పాటించాలని సూచించారు. జిల్లాలో బార్డర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలు వాహనాలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

ఎన్నికల నిబంధనలు పాటించాలి

సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 18: అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని సిద్దిపేట కలెక్టర్ ఎం.మను చౌదరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు నిబంధనలు పాటిస్తూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో వివిధ అనుమతులకు సంబంధించి సువిధా యాప్‌లో ఆన్‌లైన్‌తో పాటు నేరుగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల ప్రక్రియపై నిఘా ఉంచేందుకు కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 85 ఏండ్ల పైబడిన వారికి హోమ్ ఓటింగ్‌కు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు అజార్ హుస్సేన్

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన అజార్‌హుస్సేన్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి18: సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రానికి చెందిన కోడూరు మహ్మద్ అజార్ హుస్సేన్ జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల విజయ్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుంచి 27వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున పాల్గొననున్నట్లు తెలిపారు. అజార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై సిద్దిపేట జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కందుకూరి ఉపేందర్, దామెర మల్లేశ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రశ్నిస్తే దర్యాప్తు సంస్థలతో వేధిస్తున్న కేంద్రం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

చేర్యాల, మార్చి 18: బీజేపీ సర్కారు రాజ్యాంగబద్ధ వ్యవస్థలను నిర్వీర్యం చేసి, వాటిని గుప్పెట్లో పెట్టుకుని, ప్రజాస్వభావేక పాలన సాగిస్తూ ప్రజల హక్కులనే కాకుండా రాష్ట్రాల హక్కులను హరించి వేస్తున్నదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు ఆరోపించారు. సోమవారం చేర్యాల లోని వాసవీ గార్డెన్స్‌లో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నదని, ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తున్నదని ఆరోపించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తున్నదన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ జాతి సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వేలకోట్ల రూపాయలను బీజేపీ సొమ్ము చేసుకున్నట్లు ఆరోపించారు. భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి సీపీఎం పోటీచేస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు నక్కల యాదవరెడ్డి, రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, ఆలేటి యాదగిరి, రాళ్లబండి నాగరాజు, చొప్పరి రవికుమార్, బద్దిపడగ కృష్ణారెడ్డి, బండకింది అరుణ్‌కుమార్, శారద, దాసరి ప్రశాంత, తాడూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు

ఎట్టకేలకు భూసర్వే

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి18: భూసర్వే చేయాలని సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన గాజుల సరోజన అనే మహిళ రెండేండ్లుగా తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నది. దీనిపై 'నమస్తే తెలంగాణ' లో ఈనెల 10న 'కాళ్లరిగేలా తిరిగినా కనికరించడం లేదు' అనే శీర్షికతో కథనం ప్రచురించడంతో ఎట్టకేలకు సోమవారం మద్దూరు సర్వేయర్ స్పందించి సరోజన భూమిలో సర్వే నిర్వహించారు. సర్వేయర్ పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించకుండా కంటితుడుపుగా సర్వే నిర్వహించి, పూర్తి స్థాయి సర్వే కోసం ఆర్డీవోను సంప్రదించాలని ఉచిత సలహాలిచ్చి వెళ్లినట్లు సరోజన కుమారుడు మహేందర్ తెలిపారు. తాము దరఖాస్తు చేసుకున్న ప్రకారం తమ భూమి చుట్టూ సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని ఆయన కోరారు. తమ భూమి సర్వే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయమై సర్వేయర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. ఒక్క సర్వే నెంబర్‌కు సంబంధించిన 'టీపన్' రికార్డులు అందుబాటులో లేవని, దీనికోసం డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలని రైతుకు చెప్పినట్లు తెలిపారు.

వడగండ్లతో దెబ్బతిన్న పంటలు

రామాయంపేట, మార్చి 18: రామాయంపేట మండలంలోని డి.ధర్మారం, రాయిలాపూర్ గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడింది. రామాయంపేట పట్టణంలో ఈదురు గాలులతో జనం ఇబ్బంది పడ్డారు. డి.ధర్మారం, రాయిలాపూర్‌లో వడగండ్ల వాన గంటపాటు కురిసింది. వందల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. అక్కన్నపేట గ్రామంలో ఈదురు గాలులకు ట్రాక్టర్‌పై చెట్లు విరిగి పడ్డాయి.

అక్కన్నపేటలో ట్రాక్టర్‌పై విరిగిపడిన చెట్టు

రామాయంపేట మండల పరిధిలోని రాయిలాపూర్‌లో పడిన వడగండ్లు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్ అర్బన్, మార్చి18: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది సిద్ధం కావాలని మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో కొత్త సవాళ్లు ఎదురవుతాయని, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలన్నారు. నేరాల చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లు, ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అధికారుల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికల సమయంలో జైలు నుంచి బయటకు వచ్చిన వారి వివరాలు సేకరించాలన్నారు. నగదు, మద్యం అక్రమ రవాణా, అనుమానిత వాహనాల తనిఖీ, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ పక్కాగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) మహేందర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.